క్లుప్తంగా...

నేడు ఉప్పల్‌కు రేవంత్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు ఉప్పల్ కమాన్ నుంచి పాదయాత్ర ఉంటుందని కాంగ్రెస్ నాయకులు మందుముల పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారంలో అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పలుప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఎలివేటెడ్ కారిడార్ పనులు, రోడ్డు దుస్థితులను పరిశీలించనున్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన రేగళ్ల సతీష్‌రెడ్డి



కాప్రా: మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం కాప్రా డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి కలిశారు. తన పుట్టినరోజు కావడంతో నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి వెళ్లారు. అతడికి మంత్రి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీఎల్ఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి బీఎల్ఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించింది. సాయిరాంనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నరేందర్ పక్షవాతంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అతడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు నవీన్‌గౌడ్, ఇంద్రయ్య, బాలునాయక్, కొండల్‌గౌడ్, వెంకటేష్, భాస్కర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మల్లారెడ్డి, సికిందర్ ఉన్నారు.

ఘనంగా అష్టలక్ష్మీ సమేత వైభవలక్ష్మీ పూజ



గౌతంనగర్: అధిక శ్రావణమాసం దశమి సందర్భంగా హనుమాన్‌పేట్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో అష్టలక్ష్మీ సమేత వైభవలక్ష్మీ పూజను సామూహికంగా నిర్వహించారు. వేద శాస్త్ర విద్వాన్ బ్రహ్మశ్రీ ముదిగొండ శంకరశర్మ దంపతులు, ఆర్ష విద్యా తపస్వి బ్రహ్మశ్రీ పళర్లపాటి బంగయశర్మ, మిట్టల కిరణ్మయి లలితాదేవి ఉపాసకులు, భక్తులు, చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు యామిజాల సుధా, కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి కవిత, వసంత, సీతాదేవి, రత్నమాల, నాగరాణి, లక్ష్మీ పాల్గొన్నారు.

'వక్ఫ్ బోర్డు' స్థలాల సమస్యను పరిష్కరించాలి



కేటీఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పద్మారెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సుమారు 10 వేల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఆ స్థలాల్లో ఇళ్లు కట్టలేక, ఇళ్లు కట్టుకున్న వాళ్లు అత్యవసరాలకు విక్రయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న సర్వే నంబర్లను రెగ్యులరైజ్ చేయాలని వినతి పత్రంలో కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పద్మారెడ్డి వెల్లడించారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గణేష్‌నాయక్



హబ్సిగూడ: కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా హబ్సిగూడకు చెందిన గణేష్‌నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ బీలయ్యానాయక్, రాగిడి లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరద ముంపునకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



పెద్ద చెరువులోని ఎస్ఎన్‌డీపీ పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



హబ్సిగూడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన

రామంతాపూర్: ప్రతి సంవత్సరం కురిసే వర్షాలకు తోడుగా ఎగువనున్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వచ్చే వరద నీరు పెద్దఎత్తున పెద్ద చెరువులోకి చేరి చెరువు సమీపంలో ఉన్న హబ్సిగూడలోని రవీంద్రనగర్, సాయిచిత్ర కాలనీ, లక్ష్మీనగర్, రామంతాపూర్‌లోని ప్రగతినగర్, ఇందిరానగర్, నేతాజీనగర్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీలోని ఇళ్లు, రోడ్లపై భారీగా వరద నీరు నిండేది.

వరద నీటిని తొలగించడానికి బాహుబలి మోటారు కూడా ఏర్పాటు చేసి వరద నీటిని తోడి ప్రగతినగర్ చిన్న చెరువు ద్వారా తరలించేవారు. అయితే పెద్ద చెరువు నుంచి వచ్చే వరదలకు శాశ్వతంగా పరిష్కరించేందుకు గతేడాది మార్చి 11న రూ.10.34 కోట్లతో నిర్మించే ఎస్ఎన్‌డీపీ నాలా పనులను మున్సిపల్ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్థానిక ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మేయర్ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్ద చెరువును వరద నీరు సాఫీగా వెళ్లింది. ఏడాదిలోపే ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పూర్తి చేసేందుకు కృషి చేసినందుకు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి వరద ముంపు ప్రాంతాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే ఎజెండాగా తీసుకొని రాజకీయాలకు తావులేకుండా అన్ని డివిజన్లకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హబ్సిగూడ డివిజన్ గోకుల్‌నగర్, విశాల్‌మార్ట్ వీధిలో రూ.79 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో ఇప్పటికే భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్, డీఈ నాగమణి, ఏఈ సాయికిరణ్, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, కాసం మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, డాక్టర్ బీవీ.చారి, శివ, శ్రీధర్, కృష్ణ, అక్బర్, రాజు, కుమారస్వామి, బీజేపీ నాయకులు సంజయ్ పటేల్, చెల్లోజు ఎల్లాచారి, సోమయ్యగౌడ్, శ్రీనివాస్, అరవింద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ కేటీఆర్‌కు వినతి



రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కేసీఆర్‌నగర్‌లో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని శుక్రవారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్ రావు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం సమర్పించారు. భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, ఇంటి నెంబర్లు, రోడ్లు, వీధి దీపాల వంటి సమస్యలు ఉన్నాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని అన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి జర్నలిస్టులు



ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో మేయర్లు

బోడుప్పల్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధిగా పనిచేయాలని మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. మేడిపల్లిలో శుక్రవారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరేలా జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలన్నారు. అంతేగాకుండా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ముందంజలో ఉండాలన్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు పొరపాటున తప్పులు చేస్తే వాటిని వెలుగులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కొత్త లక్ష్మిరవిగౌడ్, కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, సింగిరెడ్డి పద్మారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని సృజన, సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్, మేడిపల్లి టీడీపీ అధ్యక్షుడు కుతాడి నర్సింహ, మేడిపల్లి మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవిచంద్ర తదితరులు ఉన్నారు.

అన్ని సమస్యలకు దశలవారీగా పరిష్కారం



కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

బోడుప్పల్: వారం రోజులుగా కురుస్తున్న బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో శుక్రవారం స్థానిక కార్పొరేటర్లతో కలిసి కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి పర్యటించారు. 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్, 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్, 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికలను రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గుర్తించిన పనులను ప్రయారిటీ ప్రకారం పూర్తి చేస్తామన్నారు. అన్ని సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతామన్నారు. పాలకవర్గం, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. డీఈఈ బాలమురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

వరదలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



జీహెచ్‌ఎంసీ ముట్టడిలో సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి

కాప్రా: నగరంలో నెలకొన్న వరద సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం బి–బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరదలతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ పిలుపునిచ్చిన జీహెచ్‌ఎంసీ ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం నుంచి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.

చెంగిచర్ల డిపో మేనేజర్‌గా కవిత



బోడుప్పల్: చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శుక్రవారం కవిత పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన డీఎం ఈసు ఉద్యోగ విరమణ పొందడంతో ఆర్మూర్ డిపో మేనేజర్‌గా ఉన్న కవిత ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేలా కృషి చేస్తానన్నారు. అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, సత్యన్, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

ఉప్పల్‌లో బార్బిక్యూనేషన్ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మన్సూర్ మెమన్

ఉప్పల్: ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో బార్బిక్యూనేషన్ రెస్టారెంట్‌ను సంస్థ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మన్సూర్ మెమన్, అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ సందీప్, రమేష్ కాందాతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో 13వ శాఖను ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దశాబ్ద కాలంగా ఆహార ప్రియుల అభిరుచులకు అనుగుణంగా రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తోందని తెలిపారు. మెనులో దాదాపు 20కి పైగా వెజ్–నాన్ వెజ్ వంటకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లలకు ఉచితమన్నారు.

వర్షాల కారణంగా కూలిన ఇల్లు



ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

మల్లాపూర్: ఇటీవల కురిసిన వర్షానికి నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట కాలనీలో జి.వెంకటేష్ ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంకటేష్ తార్నాకలోని డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్నాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. కాప్రా సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి నిధులివ్వండి

మల్లాపూర్: నాచారం రెడ్డి శ్మశానవాటిక అభివృద్ధి పనుల కోసం రూ.35 లక్షలను మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి పత్రం అందజేశారు. నిధులు మంజూరు చేస్తామని జెడ్సీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



వినతి పత్రం అందజేస్తున్న శాంతి సాయిజెన్‌శేఖర్

పనుల్లో నాణ్యత పాటించాలి



గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. మిర్జాల్‌గూడ పవన్ మోటర్స్ వద్ద రూ.26 లక్షలతో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఏఈ దివ్యజ్యోతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫలహార బండ్ల ఊరేగింపు



ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, సీపీ చౌహాన్ తదితరులు



డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



ఉప్పల్ కార్పొరేటర్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

ఉప్పల్: ఉప్పల్ మహంకాళి అమ్మవారి బోనాల సంబురాలు గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. యువకుల కేరింతలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలతో ఉప్పల్ వీధులన్నీ మార్మోగాయి. పోటాపోటీగా యువకులు అమ్మవారిని ఫలహార బండ్లను ఊరేగించారు. ప్రముఖులు ఊరేగింపులో పాల్గొన్నారు.